ఈనాడు ఆదివారం - 13, ఫిబ్రవరి 2000

# ఒక హృదయం చాలదు!

రామచంద్రపురం నుంచి బావ ప్రసాద్ రాసిన ఉత్తరం యథాలాపంగా విప్పాడు దీక్షితులు. ఉత్తరం రెండు మూడు లైనులు క్షేమ సమాచారాలతో సాంప్రదాయకంగా నడిచి, అది అక్కడి నుంచి మామగారి మీద నిందలూ విమర్శలతో అక్షరాల్నీ నింపుకొని విజృంభించింది. దీక్షితులు ఉత్తం చదువుకున్నంతసేపూ ప్రసాద్ తన పక్కనే కూర్చుని ఆ ఊళ్ళో నిత్యం జరిగే సంగతులు టీకా తాత్పర్య సహితంగా విన్నవిస్తోన్నట్టు కిందా -మీదా అయ్యాడు. పైగా ఆ ఉత్తరంలోని విసుర్లు, తమ కుటుంబ సభ్యులమీద వ్యాఖ్యానాలు లెక్కకు మించే ఉండి, ఉత్తరం ముగించినా దీక్షితులకు అదృశ్యవాణి పలుకుల్లా అవి

గుర్తుకు రాసాగాయి. చెల్లెలు లీల వారినికో రోజు తండ్రి తీరును చూసి, ఎలా కన్నీరు కారుస్తోందో, ఆ కన్నీరు ఎలా మడుగుగా, చెరువుగా మార్పు చెందుతున్నాయో రాశాడు. అందుకే ఓసారి రామచంద్రాపురం వచ్చి తండ్రికి పరోక్షంగానో, ప్రత్యక్షంగానో హితువు చెప్పవల్సిందిగా నన్ను హెచ్చరించాడు. ఆఖరిగా ఉత్తరం ముగించే ముందు మామగారిని కనుక చూసీ చూడనట్టు ఊరుకుంటే వారికి వారసత్వంగా మిగిలిన ఇల్లూ, తదితరంగా వెనకేసిన డబ్బూ పరాయివాళ్ల పాలవుతుందనీ - అది తథ్యం అనీ నిష్కర్షగా అటూ ఇటూ జ్యోతిష బాష్యం చేశాడు.

అప్పుడే లోపలి నుంచి కాఫీ కప్పు తెస్తూ, "ఎక్కడి నుంచి ఉత్తరం" అని అడిగింది కళ్యాణి.

దీక్షితులు భార్యనోసారి చూసి, "కూర్చో" అని, ఆపైన ఉత్తరం మోసుకొచ్చిన సంగతులన్నీ విడమర్చి చెప్పాడు. కళ్యాణి ఏం మాట్లాడలేదు. "నువ్వేమంటావ్?"

"మీ నాన్నగారి సంగతి మీకూ నాకూ తెలియదా... మీ బావగారూ అదే ఉత్తరంలో రాశారు. ఆయన తీరు మారదు... మీరెళ్ళి ఏం చేస్తారు?"

దీక్షితులు ఏం మాట్లాడలేదు... టేబుల్ మీద చూపుడు వేలితో గీతలు గీస్తూ ఉండిపోయాడు.

"మంచీ చెడూ ఆయనకు తెలియాలి... అయినా చెట్టంత తండ్రి ముందు నిలబడి ఏ కొడుకు మాత్రం హితబోధ చేయగలడు? చిన్నవాళ్ళయితే ఎలానో అలా చెప్పచ్చు...."

"మా నాన్నకి ఇంకా యాభై ఏళ్లు కూడా రాలేదు. ఆయన దురదృష్టం అలా వుంది. అందుకే ఇటు నువ్వూ అటు బావా కూడా ఆయన్ని మాటలంటున్నారు..." అన్నాడు నెమ్మదిగా దీక్షితులు....

"నాకు మామగారి మీద కక్షేం లేదండీ.... మీరన్నట్టు ఇది ఏనాడో చేసుకున్న ఖర్మ.... తను దగ్గర వుంటున్నాడు కాబట్టి, దగ్గర నుంచి చూస్తున్నాడు కాబట్టి ప్రసాద్ అన్నయ్య బాధతో అలా రాసి వుంటాడు..."

"అయితే నన్నేం చేయమంటావ్?"

"ఇది వరకు ఇలానే నాలుగైదు సార్లు వెళ్లారు... ఏమయ్యింది? ఇప్పుడూ అదే అవుతుంది. పైగా ఆయన సర్వీసులో ఉన్న మనిషి.. ఏ ఎరన్డ్ లీవో, మెడికల్ లీవో పెట్టించి ఆ ఊరు నుంచి, ఆ మనిషి నుంచీ దూరం చేయడం ఒకటే ప్రస్తుతం మన చేయగలిగిన పని... అదీ కాకపోతే ఇంకా దారులేమున్నాయో ఆలోచించాలి..."

"కళ్యాణీ.... మనం ఏదో ఒకటి చెయ్యాలి. లేకపోతే నాన్న మనకు దక్కడు. ఆపైన అవమానాలు భరిస్తూ ఉండాలి..." అంటూ బేలగా మారాడు దీక్షితులు. కళ్యాణి పది నిముషాలు ఆలోచించింది... నెమ్మదిగా, 'ఒక దారి వుంది' అంటూ చెప్పసాగింది.

❖ ❖ ❖

ఆ సాయంత్రం చలపతిగారు అలవాటుగా ఇస్త్రీ చేసిన గ్లాస్కో పంచె కట్టుకుని, దానిమీద పెద్దాపురం సిల్కు లాల్చీ వేసుకున్నాడు. ఆపైన భుజం మీద ఎరుపూ ఆకుపచ్చ రంగులున్న పందలపాక కండువా తీర్చిదిద్దుకున్నాడు. తన పెట్టెలోంచి డియోరోమా సెంటుబాటిల్ తీసి, జేబురుమాలుకు కాస్త రాసుకున్నాడు. అద్దం ముందు నిలబడి మరోసారి తల దువ్వుకున్నాడు. కళ్లకింద నల్ల భాగాల మీద క్రీమ్ రాసి ఆపైన పౌడర్ అద్ది, నెమ్మదిగా ఇంటికి తాళం వేసి దాన్ని పక్కింటి రామనాథంగారి చేతిలో పెట్టాడు. 'మా వాళ్లు వస్తే ఇవ్వండి... సరేనా' అని.

"గుడికా?"

"అవును"

"పెళ్లికొడుకులా తయారైతే ఏ క్లబ్‌కో, పెళ్లికో అనుకున్నాను" వేళాకోళం చేశాడు, రామనాథం....

"నిజమైన భక్తులు గుడికి శుచిగా, శుభ్రంగా తయారయి వెళ్లాలని మా నాన్నగారు చెప్తుండేవారు. అక్కడ భగవంతుణ్ణి చూడండి.... ఆయన సర్వాలంకారాలు చేసుకుని గానీ మనకు దర్శనం ఇవ్వడు... నిజమైన ఆరాధకులు తనని అనుకరించాలని ఆయన ఆశపడతాట్ట...."

ఆపైన చలపతిగారు నాల్గు రోడ్డుల కూడలికి వెళ్లాడు. అక్కడో రిక్షా ఎక్కాడు. ఆ రిక్షా తిరిగి తిరిగి బజార్లు దాటి, పక్క సందులు పట్టి - చీకటి పడ్డ తరువాత ఆయన్ని ఓ ఇంటి ముందు ఆపింది.... చలపతిగారు అలవాటుగా దగ్గరగా వేసివున్న తలుపుల్ని తీసుకుని లోపలికి వెళ్లాడు. బాత్‌రూమ్‌లోంచి ఎవరది అనే పిలుపు చిన్నగా వినిపించింది. "నేనే తిలకం" అంటూ ఆయన బెడ్‌రూమ్‌లోకి వెళ్లాడు. పడగ్గది ఎంతో శోభాయమానంగా కన్పించింది. పొడుగూ వెడల్పాలతో హుందాగా వున్న పందిరి పట్టి మంచం పూలరథానికి నకలుగా వుంది... తెల్లని దుప్పటి, తెల్లని దిండ్లు ప్రశాంతంగా ఏమీ ఎరగనట్టు తమ ఆహ్వానాన్ని మౌనంగానే విన్పిస్తున్నాయి. ఓ పక్కన గోడకు రవివర్మ చిత్రం - జుట్టు విరబోసుకుని ఒయ్యారంగా ఊయల ఊగుతున్న సుందరాంగిది... మరోపక్క రాధాకృష్ణులు పక్క పక్కన వుంటూ తన్మయంగా చిన్మయానందంగా, చూపులు కలుపుకుంటున్న దృశ్యం... తమ గుబాళింపులతో ఆ గదిని స్వర్గానికి పోటీగా తీర్చిదిద్దుతున్న - అందుకు తమ జీవితాన్ని తృణప్రాయంగా కాల్చుకుంటున్న స్టాండ్‌లో అగరవత్తులు....

పదినిముషాల్లో తెలుపు రంగు కటావ్ వాయిల్ చీర కట్టుకుని, తెల్లని జాకెట్ వేసుకుని తతిమా అలంకారం పూర్తి చేసుకోవడానికి భువికి దిగిన అనుభవజ్ఞురాలయిన అప్సరసలా, తిలకం ఆ గదిలోకి వచ్చింది. అలానే అల్మారాలో బిగించి వున్న అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంది. దాన్ని సిగగా చేసుకుంది. అందులోకి మల్లెపూల దండను రెండు చేతులతో సుతారంగా మిళితం చేసింది... చలపతి చూస్తున్నాడు. ఆమె తలలో కూడా

పాపిడికి అటూ ఇటూగా తెల్ల వెంట్రుకలు, భుజాలు, జబ్బలు, బిగువు పోగొట్టుకుని, కొంచెం అలసినట్టు కొత్త కదలికలకు అలవాటు పడుతున్నాయి. గుండెలు ఉద్వేగంతో కాకుండా ఉత్సాహంతో, ఆనందంతో మాత్రమే లయబద్ధమవుతున్నాయి.

"ముందు కాఫీ కలిపి తెస్తాను..... వంట చాలామటుకు అయిపోయినట్టే" అంటూ చలపతిగారి వైపు చూసింది తిలకం.

ఆయన మాట్లాడకపోయేసరికి "ఏమిటి కొత్తగా చూస్తున్నారు... చీరా జాకెట్‌కు దుద్దులు మేచ్ కాలేదా? లేకపోతే రోజులా మల్లెదండలో మరువం, దవనం జతకలవలేదనా?" అంటూ నవ్వింది... ఆపైన.

"తన మనిషంటే – అన్ని దశలకన్నా యౌవ్వనానికే ఎక్కువ నిర్దయ అన్పిస్తుంది... జీవితంలోకి ఇట్టే వచ్చి అట్టే కనుమరుగయిపోతుంది. అయినా కౌమారానికి అదంటే కక్షే – తనని నిర్లక్ష్యం చేస్తాడు – మనిషిని... అందుకే – ముందువెనకలకు తచ్చాడే కౌమారదశకు గుణపాఠం చెప్పడానికి వృద్ధాప్యం తన హుందాతనంతో శాంతి యుద్ధానికి సిద్ధమవుతుంది" అంది అనుభవశాలిగా తిలకం. ఆపైన లోపలకు వెళ్లి రెండు కప్పులతో కాఫీ తెచ్చి తనొకటి వుంచుకొని మరొకటి చలపతిగారికి అందించి – ఆయన పక్కనే మంచంమీద కూర్చుంది. ఆపైన "కూతురు అల్లుడు, ఊరి నుంచి ఎప్పుడు వస్తారు?" అని అడిగింది.

"రేపు వస్తారు"

"మద్రాసులో బాబు ఎలా ఉన్నాడు? కోడలు ఏమంటోంది?"

"బాగానే ఉన్నారు" అంటూ చలపతిగారు కాఫీకప్పు టీపాయ్ మీద పెట్టి తలగడమీద వాలి తలకింద రెండు చేతులూ పెట్టుకుని ఓక్షణం కళ్లు మూసుకున్నాడు.

"ఇదేమిటి... కాఫీ స్ట్రాంగ్‌గా కలిపాను.. నిద్ర రాకూడదే..."

"కాఫీపొడి అనుకుని మత్తు మందు కలిపి ఉంటావ్" నవ్వుతూ అన్నాడు.

"ఛా, పొండి"

"తిలకం – అసలు ఈరోజు ఇటు రాకూడదనుకున్నాను. కానీ కాళ్లు నిలవలేదు.. ఎందుకో తెలుసా... రేపు మద్రాసు నుంచి మా దీక్షితులు దిగుతున్నాడు. ఇల్లంతా హడావుడిగా ఉంటుంది."

"అలానా?"

"వాడు ఒట్టినే ఏ కారణం లేకుండా రాడు. బహుశా నా అల్లుడు, కూతురు వాడి చెవులు కొరికి ఉంటారు – ఉత్తరాల్లో..."

"దానికి భయపడ్డం దేనికి... ఇది మామూలేగా... మిమ్మల్ని తనకూడా రమ్మంటాడు. అంతేగా..."

"నాకు వెళ్లడం ఇష్టంలేదు."

"అలా అనొద్దు వెళ్ళిరండి. సెలవలు ఉన్నాయిగా."

"నాకు ఇష్టం వుండదు తిలకం. ఇక్కడ నా సొంత ఇల్లు అయినా కూతురు అల్లుడి దగ్గరే అదోలా వుంది. వాడేం తక్కువ లేడు. నీతులు చెబుతాడు. ఈ ఊరునుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకోమంటాడు. లేకపోతే ఉద్యోగం మానేయమంటాడు."

"అతను లోక సహజంగానే మాట్లాడుతున్నాడు. తప్పేం వుంది..."

"ఎదిగి.. ఉద్యోగస్తులయి, సంసారాలు చేసుకుంటూ కొత్త అవతారం ఎత్తారు. నేను పాతిక సంవత్సరాల నాడు భార్య పోయినా రెండో పెళ్ళి ఎందుకు చేసుకోలేదో వాళ్ళకి తెలియదు. గూటిలో తల్లి పక్షిలా వాళ్లను పెంచినంత కాలం నేను మంచివాణ్ణి! నిన్ను తోడుగా ఎంచుకుని, నీతో సుఖపడుతుంటే నేను కొరకాని వాణ్ణి.... కండకావరంతో కన్నూ మిన్నూ కానని వాణ్ణి, పాపం – నా మూలంగా వాళ్ల పరువూ, మర్యాద, సంఘంలో వారికి దొరికిన హోదా, అన్నీ మంట కలుస్తున్నాయిట..."

"బాధపడొద్దు"

"బాధ కాదు తిలకం. ఒక్కొక్కసారి ఆపుకోలేనంత ఉధృతంగా కన్నీళ్లు తిరుగుతాయి. పాతికేళ్ళు రాకుండానే విడోయర్‌ని అయ్యాను. ఎంతోమంది పిల్లల్ని ఇస్తామన్నారు. పిల్లలు ఆరోగ్యవంతంగా పెరగరనీ, కట్టుకున్న దానికీ నాకూ మధ్య వాళ్లు నలిగిపోతారనీ వెనకడుగు వేశాను. కానీ కోరికలకు పగ్గం వేయడం ఎలాగో నాకు తెలియలేదు. వేయలేకపోయాను."

"బహుశా దీనికి కారణం నేను మీ జీవితంలోకి ప్రవేశించటమే!"

"ప్రత్యేకంగా వాళ్లకు నీమీద కోపం వుందనుకోను. నీ స్థానంలో ఏ ఆడది వున్నా పిల్లలకు ఈ రకమైన మేనియా తప్పదు."

"ఎదిగిన తరువాతనయినా వాళ్లకు మీ అవసరాలు అర్థమయి వుండాలి."

"అర్థం అవాల్సిందే. వాళ్ల దృష్టిలో నేను నలభై దాటగానే ఏ సన్యాసుల్లోనో కలిసి వుండాలి. నా దురదృష్టం కొద్దీ నేను శరీర వాంఛల్నీ చంపుకోలేకపోయాను. దేనికైనా పెట్టి పుట్టాలిగా."

"ఆ దారిన వెళ్లిన వాళ్లనూ ఒదిలిపెట్టలేదు మనవాళ్లు. వాళ్లూ నిందలు మోసిన వాళ్లే."

"నే తప్పుడోవలు తొక్కుతున్నానని నా అల్లుడు, నా కూతుర్ని వెక్కిరిస్తాడు. కోడలు పమిటకొంగు చాటేసుకుని నవ్వుతుంది..."

"ఊరుకోండి... అందుకే ఆరోజే నేను చెప్పాను. మనం దూరంగా మరోచోట బతుకుదామని... వేల గొంతుకలతో హాహాకారాలు చేసే సంఘం ఎక్కడో లేదండీ. అదిమన రక్తసంబంధీకుల ద్వారా తననోటిని విప్పిస్తుంది. ఇవి మామూలే"

"అందుకే చెప్తున్నాను తిలకం... బాగా విను. నేనో నిర్ణయానికి వచ్చాను. నా ఆస్తి

మీద నీకు పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వదల్చుకున్నాను. అలానే మనం రేపే రిజిస్ట్రార్ ఆఫీసుకు వెడదాం..."

"చూడండి... ఇరవై ఏళ్లుగా మనం కలిసి ఉంటున్నాం. పెద్దవాళ్ళం కూడా అయిపోయాం. ఇప్పుడు ఇలాంటి రక్షణలూ సాక్ష్యాధారాలు, వాటి అవసరం వుంటుందని నేను అనుకోను..."

"ఏమో తిలకం. ఇక్కడ నా కొడుకు, కూతురు, అల్లుడు ఈ తీరున వున్నారు. రేపే దూరంగా ఉన్న నీ కూతురు ఎలా మారుతుందో?"

"చూద్దాం. ప్రస్తుతానికి వినయ ఇంకా పెళ్లికాని పిల్ల. పెళ్లయిన తరువాత కొత్త గొంతుకుతోనో, ఎరువు గొంతుకతోనో మాట్లాడకపోతే ఫరవాలేదు. మాట్లాడినా నేను పట్టించుకోను."

"ఏమో తిలకం. ఈ లోకం ఎప్పుడు అర్థమవుతుందో? ఏమిటో? ఆలోచిస్తే అంతా మాయగా వుంటుంది."

"అన్నం తింటే ఈ మాయావాదం మాయమవుతుంది లేవండి" అంది నవ్వుతూ తిలకం. చలపతి నవ్వుతూ మంచం దిగాడు.

❖ ❖ ❖

దీక్షితులు, లీల వాకిట్లో కూర్చుని ఉన్నారు. అంతకు ముందు చలపతిగారు తన పన్లన్నీ ముగించుకుని భోజనం చేసి ఆఫీసుకు వెళ్లాడు. అన్నా చెల్లెళ్లిద్దరూ పెరిగి పెద్దదయిన తమ ఊరు గురించీ, ఊళ్లో ఆనాటి పాతతరం వ్యక్తుల గురించీ ఎక్కడెక్కడో వున్న బంధువుల గురించీ జ్ఞాపకం చేసుకుని మాట్లాడుకున్నారు. ఆ తరువాత లీల తండ్రి గురించీ, ఆయన తిలకం అనే ఓ ఆడమనిషితో కలిసి వుండడం, ఆమె దగ్గరకు తరచూ వెడుతూ వుండడం ఆ విషయాలన్నీ ఒక్కొక్కటీ బాధను దిగమింగుకుని చెప్పింది. "నాన్నగారు ఇలా మారిపోతారనుకోలేదు అన్నయ్యా."

"ఇంతకీ ఆవిడ ఎవరు?"

"ఆవిడకు చిన్నప్పుడే భర్త పోయాడంటారు. ఎక్కడి మనిషో ఏ కులమో తెలియదు"

"ఇంతలో ప్రసాద్ బయటనుంచి వచ్చి భార్యనీ బావమరిదిని చూసి వాళ్ళ పక్కనే కూర్చున్నాడు.

"లీలా... పెద్దాయనతో మీరు మాట్లాడారా?"

"బావా- నిన్న రాత్రీ ఈ ఉదయం ఆయన్ని నేను చూచాయగా హెచ్చరించాను. నాతోపాటు మద్రాసు వచ్చేయమన్నాను...."

"మీ నాన్నగరితో మీరు కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడాలి. అలా కానప్పుడు రక్తసంబంధాలు, రాకపోకలు వుండవని చెప్పెయ్యాలి..."

"అలా ఎలా వీలవుతుందండీ... మా అమ్మ పోయినప్పుడు మేం పసివాళ్లం. ఆయన

అష్టకష్టాలు పడి మమ్మల్ని పెంచాడు.. ఇంతవాళ్లను చేశాడు. ఇది పేగు అండీ, తెంపుకుంటే తెగేది కాదు. మీరు మరీ అతి చెయ్యొద్దు..” అంది లీల ఉక్రోషంతో.

“చూడు లీలా. నువ్వు నన్ను అపార్థం చేసుకోవద్దు...” అని, దీక్షితుల వైపు తిరిగి...

“నాకూ ఈ ఊరునుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోవాలని ఉంది. ఏదైతే అదే అవుతుంది... మధ్య నేను చెడ్డవాణ్ణి ఎందుకవ్వాలి? అంతా మీ ఇష్టం” అనేశాడు.

“బావా నువ్వు కోపం తెచ్చుకోవద్దు. నీ మాటల్ని తప్పు పట్టాలనేది మా ఉద్దేశం కాదు..”

“ఇంకా మనం ఆలస్యం చేస్తూ పోతే ఈ ఇల్లూ, ఆయన డబ్బూ అంతా ఆమె పరం అవుతాయి. ఆ తరువాత ఆమెగారు ఈయన్ని వదిలేసిపోతుంది. ఆపైన మీ ఇష్టం..” అంటూ ప్రసాద్ బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. లీల కళ్ళు తుడుచుకుంటూ లేచి, వంటింట్లోకి వెళ్లింది...

దీక్షితులు మాత్రం అక్కడే ఆలోచిస్తూనే ఉండిపోయాడు. అవి శాఖోపశాఖలవుతూ చిలవలు, పలవలు వేస్తున్నాయి. మనసులో పుట్టిన ఆలోచనలకు ప్రతిగా తల అటునుంచి ఇటూ, ఇటు నుంచి అటు ఊగింది. అయినా వెంటనే మార్గాంతరం తోచలేదు. ఓసారి కళ్లు మూసుకుని చిన్న మెదడు భాగాన్ని, మెడనూ తడుముకున్నాడు. అప్పుడు సడెన్‌గా బయలుదేరే ముందు భార్య కల్యాణి చెప్పిన సలహా, సూక్తీ, ఆపైన ఆమె చేతికందించిన డబ్బూ గుర్తొచ్చాయి... వెంటనే బావ ప్రసాద్‌నే తిలకంగారి గురించి మరింత విపులంగా అడిగాడు. ఆ తరువాత ఊళ్లో వున్న తన స్నేహితులు ఒకళ్లిద్దర్ని కలిసి మాట్లాడాడు.

❖ ❖ ❖

గేటు తెరుచుకుని లోపలికి వస్తున్న కొత్త వ్యక్తిని చూసి, వినయ గుమ్మం దగ్గరే నుంచుని “మీకెవరు కావాలండీ?” అని అడిగింది.

“నా పేరు దీక్షితులు. మీ అమ్మగారితో మాట్లాడదామని వచ్చాను...”

“అమ్మ బయటకు వెళ్లింది...”

“అరే...”

“ఫర్వాలేదు, లోపలికి రండి.. ఆమె ఈపాటికే వచ్చేస్తూ వుండాలి...” వినయ దీక్షితులికి కుర్చీ చూపించింది... లోపలికి వెళ్లి ఓ ప్లేటులో బిస్కెట్లు తెచ్చి టీపాయ్ మీద పెట్టి, “తీసుకోండి” అంది...

“మీకు శ్రమ ఇస్తున్నాను....”

“ఇందులో శ్రమేం వుంది? కాఫీ తెచ్చిన తరువాత, ఆమాట అందురు గానీ” అని తిరిగి లోపలికి వెళ్లింది. దీక్షితులు ఓసారి చుట్టూ చూసి ఓ బిస్కట్ నోట పెట్టుకున్నాడు. వినయ కాఫీ తీసుకు వచ్చి దీక్షితులకి ఇచ్చి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంది.

“మీ పేరు.”

"వినయ..."

"ఏం చేస్తూ ఉంటారు?"

"ఢిల్లీలో యం.ఏ. ఫిలాసఫీ చేస్తున్నాను..."

"మీ నాన్నగారి పేరు?"

"చలపతిరావు... " దీక్షితులు ఆశ్చర్యంగా వినయవైపు చూసి "చలపతిరావుగారా?" అన్నాడు.

"అలా ఆశ్చర్యపోతున్నారేమిటి?"

"మా నాన్నగారి పేరుకూడా అదే... " దీక్షితులు ఖాళీ కప్పు టీపాయ్‌మీద పెట్టి "నేను వెడతాను. నాకు అర్జంటు పని వుంది... మళ్లీ వస్తాను." అన్నాడు.

"కూర్చోండి... అమ్మతో మాట్లాడాలన్నారుగా, ఆమె మీకు తెలుసా..."

"తెలుసు... కానీ..."

"ఏమిటో చెప్పండి?"

దీక్షితులు మొహమాటంగా తలదించుకున్నాడు.

"మిమ్మల్ని నేను గుర్తుపట్టాను" అంది ఒక్కసారిగా వినయ.

"నన్నా..... ఎలా?"

"మీలో మానాన్నగారి పోలికలు చాలా వున్నాయి అందుకని..."

దీక్షితులు ఏం మాట్లాడాలో, ఏరకం జవాబు ఇవ్వాలో ఎదురుగా కూర్చున్న అమ్మాయిని ఏమని ప్రశ్నించాలో ఇత్యాదులన్నీ మర్చిపోయాడు.

"నిన్న రాత్రి – మా నాన్నగారు తనింటి పరిస్థితులు, తన పిల్లల గురించి, అలాగే తనకు ఎదురవుతున్న సమస్యలు, వాటికి దొరకని పరిష్కారమార్గాలు వీటి గురించే చాలాసేపు మాట్లాడారు.. అంతా విన్న తరువాత మీ ఇంట్లో అందరూ కూడా మా అమ్మ గురించి ఏవేవో అపోహల్లో ఉన్నారనిపించింది... అందుకే మీరిలా మా ఇంటికి వచ్చారు. నిజం కదూ..."

దీక్షితులి మొహంలో కత్తివేటుకు నెత్తురు లేని మూలంగా, అది పాలిపోయింది.....

"చూడండి... మీ నాన్నగారిని నా ఊహ తెలిసినప్పటి నుంచీ మా ఇంట్లో చూస్తూ ఉన్నాను. ఆయన్నే నా కన్నతండ్రి అనుకున్నాను. అది నిజం అవొచ్చు... కాకపోవచ్చు... ఇక, వారిద్దరి గురించి... వాళ్లిద్దరి మధ్యా ఓ చక్కని అనుబంధం వుందని నాకు అన్పిస్తూ వుంటుంది.... కానీ, ఆశ్చర్యం... వాళ్లిద్దరు చట్టప్రకారం భార్యా భర్తలు కారు కానీ ఇరవై ఏళ్ళుగా కలిసి జీవిస్తున్నారు... మీకూ మీ కుటుంబ సభ్యులకూ ఈ విషయమే మింగుడు

పద్దం లేదు కదూ? అవునా?

"నా ఉద్దేశం...."

"మీరు లేనిపోని భయాలు పెట్టుకుని వారిని ఇక్కడి నుంచి తరలించుకు పోవాలను కోవడం మీకు బావుంటుందా? వారికి గౌరవాన్ని ఇస్తుందా? అసలు వారి అభిప్రాయాన్ని అడిగారా? ఆయన మనసులో ఏముందో కనుక్కోగలగారా? సారీ... మీరెవరూ కూడా మా అమ్మ మీద కోపాన్ని ఆయన మీద చూపించవద్దు..."

దీక్షితులు బొమ్మలా వినయవైపు చూస్తూనే వున్నాడు...

"మీరు బంధుత్వం దూరంగా పెట్టి ఆలోచించండి... ఏనాడో ఒక ఆడా ఒక మగా ఏదో పరిస్థితుల్లో ఒకరికొకరు దగ్గరయ్యారు. వయసు, అవసరం వాళ్లిద్దర్నీ మరింత దగ్గర చేసి వుంటుంది. అయితే లోకం దృష్టితో చూస్తే వాళ్లు కండకావరంతో కన్నూ మిన్నూ కానని వాళ్లుగా కనిపించవచ్చు... అదే సానుభూతితో అర్థం చేసుకుంటే, చూస్తే... దగ్గరగా ఉంటున్న ఇద్దరు స్నేహితుల్లాగా కూడా కనిపించవచ్చు.... తప్పే! మీకన్నా చిన్నదాన్ని ఎక్కువగా మాట్లాడుతున్నా!! నా మాట వినండి...వాళ్ల వల్ల ఏవైనా అవమానాలు వస్తే ధైర్యంగా మనం భరిద్దాం... వాళ్లు మన అండదండలు కావాలని అడగడం లేదే... వారి శేషజీవితాన్ని వారిద్దరికీ నచ్చిన తరహాలో గడపడానికి మనం అవరోధం ఎందుకు కావాలి... ఇది న్యాయం అవుతుందా?"

అప్పుడు దీక్షితులుకి – వినయ నోటివెంట వచ్చే మాటలు వరద సమయంలో నీటి ఉధృతి తరహాలో కాకుండా – చైత్రమాసంలో గోదావరి పాయలోంచి జాలువారి కొత్తదారులు అన్వేషణ చేసిన నీటి నడకలోని పొందిక, ఆ కదలికా కనబడ్డాయి...

"మా ఫిలాసఫీ ప్రొఫెసర్‌గారు తరచూ అంటుంటారు... 'భగవంతుడు మనిషిని సృష్టించి, అతనికి ఒకే హృదయం ఇచ్చి తప్పు చేశాడు. అదే రెండు మూడు హృదయాలు ఇచ్చి వుంటే.. ఫక్తు ఒకటి మనకే వుంచుకుని – మిగతావి ఎదుటివాళ్లకు పంచి పెట్టే నైజం అలవాటయి వుండేది'... నాకు నిజమే అన్పిస్తుంది..."

దీక్షితులు కుర్చీలోంచి లేచాడు.. వినయని చూసి అన్నాడు.. "చూడమ్మా నేను వెడతాను. కాని నేను ఇలా వచ్చి వెళ్లానని వాళ్లిద్దరితో చెప్పకు.. ఎందుకంటే నావల్లే కాదు.... ఎవరివల్లా వాళ్లిద్దరికీ నష్టం జరగకుండా చూస్తాను... సరేనా?" వినయ ఆశ్చర్యంగా దీక్షితులు వైపు చూసింది. దీక్షితులు నెమ్మదిగా గుమ్మం దిగి గేటు తెరచుకుని బయటపడ్డాడు. అప్పుడతని చేతిలో వున్న హేండ్‌బాగ్, అందులో భార్య కల్యాణి సలహాతో తిలకం అనే పరాయి మనిషిని కొనడానికి తెచ్చిన డబ్బు బరువుగా అన్పించాయి.

❖